గులాబీ గూటిలో చేరికల జోరు

చందుర్తి/ వేములవాడ: చల్మెడ లక్ష్మీనరసింహారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన జోగాపూర్ యువకులు

- బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు, యువకులు, కుల సంఘాల నేతలు
- గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించిన వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

చందుర్తి/ వేములవాడ, నవంబర్ 2: చందుర్తి మండలం జోగాపూర్‌కు చెందిన బీజేపీ నాయకుడు బిళ్ల నరేశ్‌తో పాటు 50 మంది యువకులు వేములవాడ బీఆర్ఎస్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. గురువారం వేములవాడ పట్టణంలోని చల్మెడ నివాసంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, సర్పంచ్ మ్యాకల పరశురాములు, గ్రామాధ్యక్షుడు గొల్లపల్లి పరశురాముల ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వీరికి లక్ష్మీనరసింహారావు గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. చల్మెడ గెలుపునకు కృషి చేస్తామని నరేశ్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ యువజన విభాగం మండల ప్రధాన కార్యదర్శి మారుపాక సతీశ్, గ్రామాధ్యక్షుడు గొల్లపల్లి ప్రశాంత్, గొంటి మనోజ్, అమరబండ జలేందర్, పెద్దిగారి మహేశ్, చక్రాల జలేందర్, మనోజ్, ప్రశాంత్, రమేశ్, గడ్డం రమేశ్ ఉన్నారు.

చల్మెడను కలిసిన మాల సంఘం నాయకులు

వేములవాడ రూరల్, నవంబర్ 2 : మారుపాక మాల సంఘం నాయకులు గురువారం వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తనను భారీ మోజార్టీతో గెలిపించి, కేసీర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కారుగుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను మరోసారి అధికారంలో తీసుకురావాలన్నారు. కుల సంఘం భవన నిర్మాణం నిధుల కొరతతో నిలిచిపోయిందని, భవన నిర్మాణం పూర్తయ్యేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేయగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఇక్కడ జడ్పీటీసీ మ్యాకల రవి, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, వైస్ ఎంపీపీ ఆర్‌సీ రావు, నాయకుడు బూర బాబు తదితరులు ఉన్నారు.

నిజామాబాద్ కుల సంఘాల నేతలు..

కోనరావుపేట, నవంబర్ 2: నిజామాబాద్‌కు చెందిన కుల సంఘాల నేతలు వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు సమక్షంలో గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. గ్రామానికి చెందిన యాదవ సంఘం అధ్యక్షుడు లంబ మల్లయ్య, గోసంగి సంఘం అధ్యక్షుడు సనుగుల తిరుపతి, కురుమ సంఘం అధ్యక్షుడు దాప పరశురాములు, బర్మ మహేశ్‌తో పాటు 60 మంది కుల సంఘాల సభ్యులకు చల్మెడ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ బండ నర్సయ్య, సీనియర్ నాయకుడు న్యాలకొండ రాఘవరెడ్డి, యువజన విభాగం మండలాధ్యక్షుడు ముస్సం జీవన్‌గౌడ్, గ్రామాధ్యక్షుడు మెరుగు లక్ష్మణ్, నాయకులు దుర్గం మహేశ్, ఈర్ల పరశురాములు, సనుగుల సాయి, జలంధర్, రమేశ్, రవీందర్, తాళ్లపల్లి తిరుపతి, నాయకులు తదితరులు ఉన్నారు.

వేములవాడ రూరల్: చల్మెడ లక్ష్మీనరసింహారావుతో మారుపాక మాల సంఘం నాయకులు, కోనరావుపేట: నిజామాబాద్‌కు చెందిన వివిధ కుల సంఘాల అధ్యక్షులతో చల్మెడ

ఎన్ని డ్రామాలు చేసినా.. కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మరు

- ఫ్లెక్సీలు చింపే సంస్కారం మాది కాదు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు
- 10, 15 వార్డుల్లో ప్రచారం

వేములవాడ రూరల్, నవంబర్ 2 : ఎన్ని డ్రామాలు చేసినా కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని బీఆర్ఎస్ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. గురువారం రాత్రి వేములవాడ పట్టణంలోని 15, 10 వార్డులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లెక్సీలు చింపిన విషయంతో సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, తనకు గాని తమ పార్టీకి గాని అంతస్థాయికి దిగజారిపోయే అవసరం లేదన్నారు. ఉద్యమ సమయంలోనే గాంధీ మార్గంలో తెలంగాణ తెచ్చుకున్నామని గుర్తుచేశారు. సంక్షేమ పథకాలను సక్రమంగా అందించే బీఆర్ఎస్ వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారన్నారు. శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అవతలి వ్యక్తి ఎలాంటి ఆశతో వస్తున్నాడో ప్రజలు గమనించి ఓటు వేయాలన్నారు. కారు గుర్తు పై ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించి, మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, పట్టణాధ్యక్షుడు పుల్కం రాజు, కౌన్సిలర్ రామచంద్రం, నాయకులు నర్సయ్య, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు అజయ్, శేఖర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చల్మెడకు మద్దతుగా ఇంటింటా ప్రచారం

రుద్రంగి: చల్మెడ లక్ష్మీ నరసింహారావుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న జడ్పీటీసీ, సెస్ డైరెక్టర్, బీఆర్ఎస్ నాయకులు

- బీఆర్ఎస్‌ను ఆదరించండి
- కారు గుర్తుకు ఓటేయండి
- బీఆర్ఎస్ నాయకుల విజ్ఞప్తి

రుద్రంగి, నవంబర్ 2: అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేసిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని జడ్పీటీసీ గట్ల మీనయ్య, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం కోరారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి చల్మెడ లక్ష్మీనరసింహారావుకు మద్దతుగా ప్రచారం నిర్వహించి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ ఫథకాలు, అభివృద్ధి పనులను జడ్పీటీసీ గట్ల మీనయ్య, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం ప్రజలకు వివరించారు. వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహరావుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యురాలు జమీలా బేగం, నాయకులు చెప్యాల గణేశ్, దయ్యాల కమలాకర్, బాబా, బండారి నర్సయ్య, సింగారపు గంగారెడ్డి, సింగారపు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ మండలంలో..

వేములవాడ రూరల్, నవంబర్ 1 : వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి, నాంపెల్లి, కోనాయపల్లితో పాటు తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాత్రాజుపల్లిలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి ఇంటింటా తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. మూడోసారి ముఖ్యమంత్రిగా సీఎం కేసీఆర్‌ను, వేములవాడ ఎమ్మెల్యేగా చల్మెడ లక్ష్మీనర్సింహారావును అధిక మోజార్టీతో గెలిపించాలని కోరారు. అన్ని రంగాల్లో ప్రగతిని సాధిస్తూ అభివృద్ధిలో దూసుకుపోతున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టం కట్టాలన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు మ్యాకల శ్రీనివాస్, సతీశ్ రెడ్డి, సతీశ్, అనిల్ పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: శాత్రాజుపల్లిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మనోహర్‌రెడ్డి, తదితరులు

చెక్‌పోస్ట్ వద్ద నగదు పట్టివేత

బోయినపల్లి, నవంబర్ 2: కొదురుపాక చెక్ పోస్టు వద్ద రూ. లక్షా 33వేల 433 పట్టుకున్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. గురువారం కొదురుపాక చెక్ పోస్టు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా కరీంనగర్ నుంచి సిరిసిల్ల వైపు ద్విచక్ర వాహనంపై దూడం రమేశ్ వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో ద్విచక్ర వాహనం తనిఖీ చేయగా అందులో రూ. లక్షా 33 వేల 433 వేల నగదు ఉండగా స్వాధీనం చేసుకుని అధికారులకు అప్పగించారు.

కోనరావుపేటవాసికి ఓయూ డాక్టరేట్

కోనరావుపేట, నవంబర్ 2: మండల కేంద్రానికి చెందిన యాస సుమన్ ఉస్మానియా యూనివర్సిటీ హిస్టరీ విభాగంలో పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా పొందారు. ఉస్మానియా యూనివర్సిటీ 83వ స్నాతకోత్సవంలో భాగంగా రాష్ట్ర గవర్నర్ తమిళసై సౌందర్యరాజన్, ఓయూవైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రవీందర్, అడోబ్ సీఈవో శంతాన్ నారాయణ్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా పొందినట్లు సమన్ పేర్కొన్నారు.

రైతులు మద్దతు ధర పొందాలి

కోనరావుపేట, నవంబర్ 2: రైతులు ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందాలని సీఈవో కేశవులు సూచించారు. గురువారం కోనరావుపేట సింగిల్ విండో ఆధ్వర్యంలో కనగర్తి, నిజామాబాద్, బావుసాయిపేట, గోవిందరావుపేట తండా, కొండాపూర్, వెంకట్రావుపేట, కోనరావుపేట, శివంగాళపల్లి, ఎగ్లాస్‌పూర్, నిమ్మపల్లిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిధాన్యం ఏ గ్రేడ్ రకానికి రూ.2203 మద్దతు ధర ఉందని చెప్పారు. ఇక్కడ రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్ బండ నర్సయ్య, సింగిల్ విండో వైస్ చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, నాయకులు అనుపాటి బాపురెడ్డి, రాజురెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విలాసాగర్ విద్యార్థిని

బోయినపల్లి, నవంబర్ 2: రాష్ట్ర స్థాయి వాలీ బాల్ పోటీలకు విలాసాగర్ జడ్పీ పాఠశాల విద్యార్థిని సంపంగి స్పందన ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీనివాస్ గురువారం తెలిపారు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ -14 కరీంనగర్ జోనల్ స్థాయి వాలీబాల్ పోటీలు ఇటీవల సైదాపూర్ మండలం ఆకునూర్ జడ్పీ పాఠశాలలో నిర్వహించగా అందులో ఎంపికైనట్లు వెల్లడించారు. విద్యార్థినిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఉపాధి హామీ పనులపై గ్రామ సభ

రుద్రంగి, నవంబర్ 2: మండల కేంద్రంలో కార్యదర్శి రాందాస్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనుల ప్రణాళికలపై గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి రాందాస్ మాట్లాడుతూ 2024-25 సంవత్సరంలో జరిగే ఉపాధి హామీ పనుల ప్రణాళికలపై చర్చించామన్నారు. ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్న వారందరికీ 100 రోజుల పని దినాలు కల్పిస్తామన్నారు. జాబ్ కార్డు లేనివారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉపాధి సిబ్బంది, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రుద్రంగిలో బీటీ రోడ్డు పనుల పరిశీలన

రుద్రంగి, నవంబర్ 2: మండల కేంద్రంలో రూ.2 కోట్ల 50 లక్షలతో జరుగుతున్న నాలుగు లైన్ల బీటీ రోడ్డు పనులను ఆర్‌ఆండ్‌బీ డీఈ శాంతయ్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1400 మీటర్ల పొడవుతో అంబేద్కర్ చౌరస్తా నుంచి ఇందిరాచౌక్ వరకు నాలుగు లైన్ల బీటీ రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. నాణ్యతతో బీటీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రోడ్డు నిర్మాణంలో గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఏఈ సతీశ్ ఉన్నారు.

రాజన్నను దర్శించుకున్న పీఠాధిపతి

వేములవాడ టౌన్, నవంబర్ 2 : వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారిని గురువారం హనుమాన్ దీక్షా పీఠాధిపతి శ్రీ దుర్గాప్రసాద్ స్వామీజీ దర్శించుకున్నారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అద్దాల మండపంలో భీమాశంకర్, ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ వారికి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. ఇక్కడ ఆలయ అధికారులు, విశ్వహిందూపరిషత్, బజరంగ్‌దళ్, హిందూ ఉత్సవ సమితి సభ్యులు ఉన్నారు.

అభ్యంతరకర పోస్టులు పెడితే చర్యలు తప్పవు

వేములవాడ, నవంబర్ 2 : శాసనసభ ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాలో అభ్యంతరకర, వివాదాస్పదమైన పోస్టులు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వేములవాడ పట్టణ సీఐ కరుణాకర్ హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలు గడువు దగ్గర పడుతున్న తరుణంలో కొందరు ఉద్దేశపూర్వకంగా ఎదుటివారిని రెచ్చగొట్టే విధంగా అభ్యంతరకరమైన పోస్టులు పెడుతున్నారని, ప్రత్యర్థి రాజకీయ పక్షాలను లక్ష్యంగా చేసుకొని కొన్ని వర్గాల మనోభావాలను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఫేస్ బుక్, వాట్సాప్ తదితర సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌పై ఏ రకమైన అభ్యంతరకరమైన పోస్టులు పెట్టినా తక్షణమే కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తామని స్పష్టం చేశారు. శాంతి భద్రతలు రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేసే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ కోరారు.